# 10

# క్రీస్తు: సమస్త లోకమునకు న్యాయాధిపతి

యేసు పశువుల తొట్టిలో పరుండబెట్టబడిన ఒక శిశువువలె ... నజరేతులో పెరిగి పెద్దవాడైన ఒక పిల్లవానివలె ... ఆయన ప్రసంగములను వేలాది మంది ప్రజలు వినుటకు గుమికూడిన కృపాసహితవరదానముగల ప్రబోధకునివలె ... అనేకమంది రోగులను స్వస్థపరచి దయ్యములను వెళ్లగొట్టినవానివలె ... పాపుల స్నేహితుడు మరియు వ్యసనాక్రాంతునివలె ... దయ మరియు జాలి గుండెలు గల రక్షకునివలె ... సిలువ మీద మరణించి, పాతిపెట్టబడి, మృతులలో నుండి లేచినవానివలె ... తండ్రి యొద్దకు ఆరోహణమై వెళ్లిన దేవుని కుమారునివలె చిత్రించబడినాడు. ఇదే యేసు తిరిగివచ్చును – ఆయన తిరిగి వచ్చినప్పుడు, ఆయన లోకమునకు తీర్పు తీర్చును!

## న్యాయాధిపతియైన క్రీస్తు

యోహాను 12:46–48లో, ఆయన లోకమునకు తీర్పు తీర్చుట గూర్చి యేసు ఉపేక్షించినట్లు అగుపించుచున్నది:

> నాయందు విశ్వాసముంచు ప్రతివాడు చీకటిలో నిలిచియుండకుండునట్లు నేను ఈ లోకమునకు వెలుగుగా వచ్చియున్నాను. ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండిన యెడల నేనతనికి తీర్పు తీర్చను; నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు గాని లోకమును రక్షించుటకే వచ్చితిని. నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పినమాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును.

ఏదిఏమైనా, యేసు "నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు" అని చెప్పిన వెనువెంటనే, ప్రజలు ఆయన పలికిన మాటల చేత తీర్పు తీర్చబడుదురని ఆయన సెలవిచ్చాడు. ప్రస్ఫుటంగా, యేసు ఇలా చెప్పుచుండినట్లున్నాడు: "నేను లోకమును ఖండించుటకు ఈ లోకము లోనికి రాలేదు. దానికి బదులుగా, నేను లోకమును రక్షించుటకు వచ్చాను; కానీ నన్ను మరియు నా వాక్యమును తృణీకరించు ప్రజలు ఆ వాక్యము చేత తీర్పు తీర్చబడుదురు." మానవాళికి తీర్పు తీర్చుటలో ఆయన వహించు పాత్ర ఏమియు ఉండదని యేసు భావించలేదని మనమెరుగుదుము ఏలయనగా "తండ్రి యెవనికిని తీర్పు తీర్చడు, గాని ... తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు" అని ఆయన మరొక చోట చెప్పియున్నాడు (యోహాను 5:22, 23).

క్రీస్తు మన న్యాయాధిపతియై యుండునని ఇతర క్రొత్త నిబంధన రచయితలు మరియు సువార్తికులు చెప్పారు. పౌలు ఈ విధంగా వ్రాస్తున్నాడు, "దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తు యేసు ఎదుటను, ఆయన ప్రత్యక్షతతోడు ఆయన రాజ్యముతోడు, నేను ఆనబెట్టిచెప్పునదేమనగా: వాక్యమును ప్రకటించుము" (2 తిమోతి 4:1, 2ఎ). 2 కొరింథీయులకు 5:10ఎ లో ఆయన "క్రీస్తు న్యాయపీఠము"

గూర్చి చెప్పుచున్నాడు.

అపొస్తలుల కార్యములు 17:30, 31 ప్రకారము, ఏథెన్సు మహా నగరంలోని ప్రజలతో పౌలు ఈ విధంగా మాటలాడుచున్నాడు,

> ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను, ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చ బోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు.

మత్తయి 25:31–46లో గల యేసు మాటలు ఎంతో ఆసక్తికరమైనవిగా ఉన్నవి:

> తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనముమీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయనయెదుట పోగుచేయబడుదురు; గొల్లవాడు మేకలలోనుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచి తన కుడివైపున గొఱ్ఱెలను ఎడమవైపున మేకలను నిలువబెట్టును.
>
> అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి – నా తండ్రిచేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి; దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి; పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి; దిగంబరినై యుంటిని, నాకు బట్టలిచ్చితిరి; రోగినైయుంటిని, నన్ను చూడవచ్చితిరి; చెరసాలలో ఉంటిని నాయొద్దకు వచ్చితిరని చెప్పును అందుకు నీతిమంతులు – ప్రభువా, యెప్పుడు నీవు ఆకలిగొనియుండుట చూచి నీకాహారమిచ్చితిమి? నీవు దప్పిగొనియుండుట చూచి యెప్పుడు దాహమిచ్చితిమి? ఎప్పుడు పరదేశివై యుండుట చూచి నిన్ను చేర్చుకొంటిమి? దిగంబరివై యుండుట చూచి బట్టలిచ్చితిమి? ఎప్పుడు రోగివై యుండుటయైనను, చెరసాలలో ఉండుటయైనను, చూచి, నీయొద్దకు వచ్చితిమని ఆయనను అడిగెదరు. అందుకు రాజు – మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును.
>
> అప్పుడాయన యెడమవైపున ఉండువారిని చూచి – శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టలేదు; దప్పిగొంటిని, మీరు నాకు దాహమియ్యలేదు; పరదేశినైయుంటిని, మీరు నన్ను చేర్చుకొనలేదు; దిగంబరినైయుంటిని, మీరు నాకు బట్టలియ్యలేదు; రోగినై చెరసాలలో ఉంటిని. మీరు నన్ను చూడ రాలేదని చెప్పును. అందుకు వారును – ప్రభువా, మే మెప్పుడు నీవు ఆకలిగొనియుండుటయైనను, దప్పిగొని యుండుటయైనను, పరదేశివై యుండుటయైనను, దిగంబరివై యుండుటయైనను, రోగివై యుండుటయైనను, చెరసాలలో ఉండుటయైనను చూచి, నీకు ఉపచారము చేయకపోతిమని ఆయనను అడిగెదరు. అందుకాయన – మిక్కిలి అల్పులైన వీరిలో ఒకనికైనను మీరు ఈలాగు చేయలేదు గనుక నాకు చేయలేదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాని వారితో అనును. వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు.

ఈ వాక్యభాగమును చదువు ఏ నిజాయితీపరుడైనవాడును చివరి గొప్ప దినాన, ఆయన తిరిగి వచ్చినప్పుడు, యేసు క్రీస్తు లోకమునకు తీర్పు తీర్చునను అభిప్రాయమునకు వచ్చును!

## క్రీస్తు సమస్త మానవులకు తీర్పు తీర్చును

ఆయన తిరిగి వచ్చినప్పుడు, “సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయబడుదురు” అని యేసు చెప్పెను (మత్తయి 25:32). తీర్పు గూర్చిన ఒక నివేదికను యోహాను ప్రకటన గ్రంథంలో రచించినప్పుడు, “గొప్పవారేమి కొద్దివారేమి మృతులైనవారందరు ఆ సింహాసనము యెదుట నిలువబడి యుండుట చూచితిని” అని ఆయన చెప్పుచున్నాడు (ప్రకటన 20:12ఎ). పౌలు ఇలా వ్రాస్తున్నాడు, “తాను జరిగించిన క్రియలు చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును *ప్రతివాడును* పొందునట్లు *మనమందరమును* క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలయును” (2 కొరింథీయులకు 5:10).

### ఆయన మాటల చేత తీర్పు తీర్చును

ప్రజలు యేసు మాటల చేత తీర్పు తీర్చబడుదురు (యోహాను 12:48). ప్రకటన 20వ అధ్యాయంలో వర్ణింపబడిన తీర్పు తీర్చబడు దినాన, “గ్రంథములు విప్పబడెను” (20:12). తీర్పు నిమిత్తము మన యుగములోని ప్రజలు పోగుచేయబడిన ఆ దినాన విప్పబడు గ్రంథములలో ఒకటి క్రొత్త నిబంధనయై యుండును. మనలో ప్రతి ఒక్కనికిని పరిశుద్ధ బైబిలు ఉపదేశానుసారంగా తీర్పు తీర్చబడును – మన సొంత దృక్పథము లేక అభిప్రాయములు, ఇతరుల అభిప్రాయములు, లేక సంఘ చట్టములు లేక మానవకల్పిత నియమములనుబట్టి కాదు. కాబట్టి, మనము మానవుల సాంప్రదాయములను అనుసరించుటకు బదులుగా క్రీస్తు చిత్తమునకు లోబడుచున్నామని మనము నిశ్చయపర్చుకొనవలెను!

### మన క్రియల చొప్పున తీర్పు తీర్చును

ప్రజలు చేసిన క్రియలు వారికి తీర్పు తీర్చుటకు ఆధారముగా తీసికొనబడునని కూడా పరిశుద్ధ సత్యవేదము చాటిచెప్పుచున్నది. ప్రకటన 20:12, 13లో ఇలా వ్రాయబడి యున్నది,

> మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైనవారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడియుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటినిబట్టి *తమ క్రియలచొప్పున మృతులు తీర్పుపొందిరి.* సముద్రము తనలో ఉన్న మృతులను అప్పగించెను; మరణమును పాతాళలోకమును వాటి వశముననున్న మృతుల నప్పగించెను; వారిలో ప్రతివాడు *తన క్రియల చొప్పున* తీర్పుపొందెను.

తీర్పు దినాన, ప్రతి ఒక్కడు “దేహముతో జరిగించిన వాటి ఫలమును పొందును” (2 కొరింథీయులకు 5:10బి). ఒకడు ఆకలిగొన్నవానికి ఆహారం పెట్టాడా లేదా, దిగంబరియై యున్నవానికి బట్టలిచ్చాడా లేదా, రోగియైయున్నవానిని చూడవెళ్లాడా లేదా అను దాని ఆధారంగా తీర్పు తీర్చబడునని యేసు ఉపయోగించిన దృష్టాంతము సూచించుచున్నది.

ప్రతి ఒక్కరికిని తీర్పు ఒకే విధముగా తీర్చబడును. “దేవుడు పక్షపాతి కాడు” (అపొస్తలుల కార్యములు 10:34), గనుక తీర్పు దినాన ఎటువంటి పక్షపాతమైనను చూపింపబడదు. కొద్దివారేమి గొప్పవారేమి ఒకే విధంగా ఒక్క ప్రమాణం ప్రకారం లెక్క ఒప్పజెప్పుబాధ్యత వహించినవారై యుందురు! ఎలానైతేనేమి ఎదో ఒకవిధంగా నీవు “ప్రత్యేకమైన” వాడవు

గనుక రక్షింపబడుటకు మిగిలిన ప్రతి ఒక్కరు చేయాల్సిన అవసరం లేదని నీవనుకొనినట్లు నడిపింపబడినట్లయితే, నీవు మరొక పర్యాయము దీని గూర్చి ఆలోచించవలసిన అవసరమున్నది!

మన నడవడిక ముఖ్యము కాదని – క్రీస్తుకు ముఖ్యమైనదెల్లా మనము ఆయనయందు విశ్వసించుచున్నామా లేదా అన్నది మాత్రమే అని – ఈనాడు కొందరనుకొనుచున్నారు. నిజమైన సంగతేమనగా మన చర్యలు, మన క్రియలు, ముఖ్యమైనవైయున్నవి! మనకు తీర్చబడు తీర్పు మన విశ్వాసముపై మాత్రమే ఆదారపడి యుండదు, కానీ మనము చేసినవాటిపై కూడా ఆధారపడియుంటుంది!

అలాగైతే, తీర్పు, క్రొత్త నిబంధనలో బయలుపరచడియున్నట్లుగా, క్రీస్తు బోధలపైనను, మనము చేసిన క్రియలుపైనను ఆధారపడి యుండును. ఈ రెండు ఒకదానితో మరొకటి ఎలా సంబంధముగలవై యున్నవి? సమాధానం స్పష్టంగా ఉన్నది: మనము చేసిన క్రియలు క్రొత్త నిబంధన ఉపదేశములతో పోల్చబడును. మనము క్రీస్తు ఉపదేశములకు లోబడనట్లయితే, "... నా యొద్ద నుండి పొండి" అను భయానకమైన మాటలు విందుము (మత్తయి 7:23; 25:41; లూకా 13:27).

## క్రీస్తు తీర్పు వలన కలుగు ఫలితం బహుమానము లేదా దండనము

మత్తయి 25వ అధ్యాయం ప్రకారము, తీర్పు దినాన "నా తండ్రి చేత ఆశీర్వదింపబడినవారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" అని కొందరితో చెప్పబడును (వచనం 34). ఇతరులతో, "శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" అని రాజు చెప్పవలసిన అవసరముండును (వచనం 41). "శపింపబడినవారు" నిత్య శిక్షకు పోవుదురు, కానీ నీతిమంతులు నిత్య జీవమునకు పోవుదురని యేసు సవివరంగా చెప్పాడు (వచనం 46). కాట్టి ఫలితాలు, నిత్య శిక్ష లేదా నిత్య జీవమై యుండును!

ప్రకటన గ్రంథం 20వ అధ్యాయంలో ఇవ్వబడియున్నట్లు ఎవరి పేర్లైతే "జీవ గ్రంథమందు వ్రాయబడినట్టు కనబడలేదో" వారు "అగ్ని గుండములో పడవేయబడిరి," ఇది "రెండవ మరణము" అనునది తీర్పు సన్నివేశము యొక్క పరిణామమై యుండినది (ప్రకటన 20:14, 15). తీర్పు దినాన, కొందరు "జీవ గ్రంథము"లో అగుపిస్తారు కాబట్టి వారు నిత్య జీవమును అనుభవిస్తారు. మిగిలిన వారందరు "అగ్ని గుండములో" పడవేయబడుదురు, ఇది రెండవ మరణము, మరొక చోట "నరకము" అని పిలువబడినది!

తీర్పుకు సంబంధించిన ఈ రెండు పర్యవసానములు క్రీస్తు తిరిగి వచ్చుటకు గల రెండు హేతువులకు అనుగుణంగా ఉన్నవి. ఒక ప్రక్క, క్రీస్తు "తన కొరకు కనిపెట్టుకొని యుండు వారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ, రెండవసారి ప్రత్యక్షమగును" అని హెబ్రీయులకు 9:28 చెప్పుచున్నది. మరొక ప్రక్క ఆయన అనుగ్రహించు రక్షణ ప్రతిపాదనను తృణీకరించువారికి ఆయన నాశనము కలుగజేయును. పౌలు ఇలా వ్రాయుచున్నాడు,

> ... ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు

లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచు వారికి శ్రమయు, శ్రమపొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును, విశ్వసించిన వారందరియందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖమునుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు (2 థెస్సలొనీకయులకు 1:7-9).

హెబ్రీయులకు 9:28 క్రీస్తు రక్షించుటకు తిరిగి వచ్చునని చెప్పుచుండగా, క్రీస్తు నాశనము చేయుటకు తిరిగి వచ్చునని 2 థెస్సలొనీకయులకు 1:7-9 చెప్పుచున్నది. ఈ రెండిటిలో దేనిని పరిగణలోనికి తీసికొనాలి? క్రీస్తు రక్షించుటకు వచ్చునా లేక నాశనము చేయుటకు వచ్చునా? సహజంగానే, క్రీస్తు "రక్షించుటకును నాశనము చేయుటకును వచ్చును!" దీనికి సమాధానమై యున్నది. ఆయనకు లోబడినవారు ఆయన రాకడ నిమిత్తము ఆతురతతో ప్రతీక్షించుచుందురు, గనుక వారు రక్షింపబడుదురు. ఆయనకు లోబడక ఆయన యందు విశ్వాసముంచని వారు క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు నిత్య నాశనమునకు గురియగుదురు. యేసు క్రీస్తు యొక్క రెండవ రాకడ మరియు ఆయన తీర్పు యొక్క ఫలితం ఒకటే అయియుండును: కొందరు నిత్య జీవమునకు పోవునట్లు రక్షింపబడుదురు, ఇతరులు నశించి నిత్య నాశనము లోనికి పోవుదురు!

## ముగింపు

మనము యేసు క్రీస్తు విషయంలో ఆయనను ప్రేమామయుడుగాను, జాలి గుండెలు గలవాడుగాను, క్షమించు రక్షకుడుగాను మాత్రమే కాదు, కానీ మన న్యాయాధిపతి యని కూడా ఆలోచించవలెను! యేసు పిలాతు యెదుట నిలువబడి యుండినప్పుడు, ఆయనకు తీర్పు తీర్చబడినది; కానీ ఆయన తిరిగి వచ్చినప్పుడు, ఆయనే న్యాయాధిపతియై యుండును. పిలాతు, యేసును ఖండించిన యూదులు, మరియు ఇతరులందరును యేసు చేత తీర్పు తీర్చబడుదురు! యేసు ఈనాడు "తలుపు నొద్ద నిలుచుండి తట్టు (ను) చున్నాడు" (ప్రకటన 3:20), మన హృదయ ద్వారములను తెరచినట్లయితే లోనికి వచ్చుటకు ఆశిస్తున్నాడని అడుగుచున్నాడు. లోకమునకు తీర్పు తీర్చు న్యాయాధిపతిగా సింహాసనాసీనుడై యున్న ఆ దినాన, ఆయన మన హృదయము లోనికి రావచ్చునా వద్దా అని అడుగడు. కానీ మనము ఎక్కడికి - పరలోకమునకు లేదా నరకమునకు - వెళ్లవలెనో మన ఒక్కొక్కరికి చెప్పుచుండును!

నిన్ను గూర్చి తీర్పు తీర్చబడినప్పుడు దాని పర్యవసానమేమై యుండును? న్యాయాధిపతియైన క్రీస్తుయెదుట నీవు నిలువబడి యుండునప్పుడు, ఆయన నిన్ను గూర్చి ఏమని తీర్పు చెప్పును? ఈ నాడు నీవు ఆ న్యాయస్థాన తుది తీర్పు తీర్చబడుచున్న ప్రక్రియలో ఉన్నావు. నీవు చేసిన క్రియలు మంచివైనట్లయితే, నీవు క్రీస్తు వాక్యమునకు లోబడుచున్నవాడవైనట్లయితే, దేవుని కృపామహదైశ్వర్యము చొప్పున నీవు అనుకూలంగా ఇవ్వబడు తీర్పు నిమిత్తము ప్రతీక్షించుచుండగలవు. మరొక ప్రక్క నీవు లోబడనివాడవు మరియు విశ్వసించనివాడవునై యున్నట్లయితే, నీ క్రియలు చెడ్డవైయున్నట్లయితే లేక క్రీస్తు ఆశ మేరకు నీవు తగిన విధంగా ప్రవర్తించనట్లయితే, న్యాయాధిపతియైన క్రీస్తు, "నా యొద్ద

నుండి పొంది … నిత్యనరకాగ్నిలోనికి” అని నీకు ఆశ్చర్యపడనవసరంలేదు!

నీవు ప్రస్తుతము జీవించుచున్న రీతి చొప్పున, కడవరి సన్నివేశము నిన్ను గూర్చి తీర్చబడిన తీర్పునుబట్టి ప్రాణాంతకమైన పరిణామమై యుండబోవునదైనట్లయితే, ఇప్పుడైనా నీవు క్రీస్తు వైపు తిరిగి నీ గమ్యమును మార్చుకొనవచ్చును. నిత్య గమ్యమును నిర్ధారించుటలో క్రియలువహించు పాత్ర వాటికున్నప్పటికిని, మంచి క్రియలు పాపముల వలన కలుగు ఫలితమును (నష్టమును) పూరించలేవు. క్రీస్తు రక్తము మాత్రమే మన పాపములను కడిగివేసి మనము రక్షింపబడు సాధ్యతను సమకూర్చగలదు. ఆయన రక్తము చేత రక్షింపబడుటకు, నీవు ఆయన యందు విశ్వసించి అట్టి విశ్వాసముతో ఆయనకు లోబడవలెను. “ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము (అపొస్తలుల కార్యముల 16:31), ఆ తరువాత “బాప్తిస్మము పొంది” యేసు క్రీస్తు రక్తములో “నీ పాపములను కడిగివేసికొనుము!” (అపొస్తలుల కార్యముల 22:16). అప్పుడు నీవు దేవుని కృప చేత రక్షింపబడుదువు. కాబట్టి, రాబోవుచున్న తీర్పును గూర్చి నీకెటువంటి భయమైనను ఉండదు, కానీ ఆయనతో కూడ ఉండునట్లు పరలోకమునకు వెళ్లుటకు సంసిద్ధులైయున్నవారిని రక్షించు క్రీస్తు రాకడ కొరకు నీవు ఆసక్తితో ప్రతీక్షించగలవు!